# ఆ వయసు వేరు

తమ ఆఫీసుకు రాబోయే కొత్త ఆఫీసర్ పేరు నిరంజనం అని విన్నప్పటి నుంచీ మనసు మనసులో లేదు రాఘవకి.

ఆ నిరంజనం, ఈ నిరంజనం ఒక్కడే కాదు గదా? అదే అతని మనసుని భయపెట్టి బాధిస్తున్న ఆలోచన.

అతనే అయితే తన అంతు చూడక మానడు! రాఘవ దిగులు పడిపోసాగాడు.

అతను భయపడుతున్న రోజు రానే వచ్చింది. ఆ రోజే కొత్త ఆఫీసర్ గారు వచ్చేది.....

అందరూ పది గంటలు కూడా కాకుండానే వచ్చేసారు. బుద్ధిగా ఎవరి సీట్లో వాళ్ళు కూర్చుని శ్రద్ధగా పని చేస్తున్నట్లు నటించసాగారు. కొత్త ఆఫీసర్ ఎలాంటి వాడో......? అదే అందరి లోనూ వున్న భయం....

పని చేస్తున్నట్లు ఫోజు పెట్టి సీట్లలో కూర్చున్నా అందరి దృష్టి గుమ్మం మీదే వుంది. కారు శబ్దం వినబడితే చాలు కొత్త ఆఫీసర్‌గారు వచ్చేసారేమోనని కంగారు పడిపోసాగారు.

తన క్లాస్‌మేట్ నిరంజనం, ఈ ఆఫీసర్ నిరంజనం ఒక్కళ్ళు కాగూడదని మనసులో పేరు పేరునా అందరి దేవుళ్ళకి మొక్కుకోసాగాడు రాఘవ.

ఇంతలో కారు ఆగిన శబ్దం కావడంతో అటెండరు బయటికి పరుగెత్తాడు.

అతను కారు తలుపు తీయగానే హుందాగా బయట కాలు పెట్టింది ఆరడుగుల పొడవు శరీరం. బ్లాక్‌సూట్‌తో తెల్లటి శరీరం మెరిసిపోతోంది.

ముందు ఠీవిగా ఆఫీసర్.... వెనుక నమ్రతగగా అటెండరు.... లోపలికి అడుగు పెట్టారు.

అందరూ చటుక్కున లేచి నిలబడ్డారు.

అందరి వంకా ఒక్కసారి నిశితంగా చూసాడు ఆ కుర్ర ఆఫీసర్.

రాఘవ నెత్తిన పిడుగుపడ్డట్టు వులిక్కిపడ్డాడు.

వాడే ఆ నిరంజనంగాడే ఈ ఆఫీసర్!! ఇక తన భరతం పడతాడు!!! కాళ్ళు వణక సాగాయి....

తనకి విష్ చేసిన వాళ్ళందర్నీ విష్ చేస్తూ హుందాగా ముందు కొస్తున్నాడు.....

తన దగ్గరికి రాగానే తనకి తెలీకుండానే విష్ చేసాడు రాఘవ.

నిర్లక్ష్యమైన చిరునవ్వుని విసిరేసి ముందు కెళ్ళిపోయాడు నిరంజనం.... తల తీసేసి నట్లనిపించింది రాఘవకి.

సీట్లో కూర్చున్నాడన్న మాటే గాని మనసు పని మీద లగ్నం కావడం లేదు.

"ఆఫీసర్ గారు పిలుస్తున్నారు....." అటెండర్ చెప్పాడు.

వస్తూనే మొదలు పెడుతున్నాడన్నమాట! తప్పదు... ఇప్పుడు తను వాడి చేతిలో చిక్కాడు ఏం చేసినా భరించాల్సిందే!!

ఆఫీసర్ రూమ్‌లోకి అడుగు పెట్టాడు.



"వూ.... నువ్విక్కడ క్లర్క్‌గా పని చేస్తున్నావన్నమాట.....!" రివాల్వింగ్ ఛెయిర్లో అటు ఇటు తిరుగుతూ అడిగాడు నిరంజనం.

"అవున్సార్...."

"నేను వర్క్ విషయంలో చాలా స్ట్రిక్ట్. వర్క్ పెండింగ్ వుండడానికి వీల్లేదు..... ఆ విషయం హెచ్చరించడానికే పిలిచాను. ఇక వెళ్ళు...."

బయటి కొచ్చేసాడు రాఘవ.

ఇలా పిలిచి తనొక్కడికే వార్నింగ్ ఇవ్వడంలోనే బయట పడుతోంది నిరంజనం మెంటాలిటి. ఇక తనని చీల్చి చెండాడుతాడు అందులో సందేహం లేదు.

సీట్లో కూలబడి ఫైళ్ళలో మునిగిపోయాడు రాఘవ.

మరో అరగంటలోనే మరో పిలుపు...

నీ సీట్లో వర్క్ అంతగా పెండింగ్ వుందేం అఫీసచ్ చివాట్లు. తను కొత్తగా ఆ సీట్లోకి మారాడు. ఈ కొద్దికాలంలోనే చాలా బాగా పెండింగ్ క్లియర్ చేసాడు. ఆ విషయం చెప్పినా అతను పట్టించుకోడు. అందుకే మౌనంగానే చివాట్లన్నింటినీ భరించాడు. సీట్లోకి వచ్చి కూలబడ్డాడు. వెనుకే హెడ్‌క్లర్క్ ఆఫీసర్ రూమ్‌లోకి వెళ్ళాడు. మిగతా స్టాఫంతా జాలిగా చూడసాగారు. లంచ్ వరకూ వంచిన తల ఎత్తకుండానే పని చేసుకుపోసాగాడు రాఘవ.

లంచ్ అవర్ లో కూడా అతనికి బయటికి వెళ్ళ బుద్ధి కాలేదు. సీట్లోనే కూర్చుని ఆలోచించసాగాడు.

ఇలా ఎంత కాలం తను నిరంజనం కింద పని చేయగలడు? శలవు పెట్టేస్తే.... ఎంత కాలమని శలవు పెట్టగలడు? పోనీ రిజైన్

చేస్తేను? తనతో పాటు పెళ్ళాం పిల్లల్ని కూడా పస్తు పడుకో బెట్టి చంపేయాలి.......

తనని చూస్తే పిల్లిలా భయపడే నిరంజనం ఇప్పుడు పులిలా దెబ్బకొట్టడానికి చూస్తున్నాడు. ఈ అయిదారు సంవత్సరాలలోనే ఎంత మార్పు! అప్పటికి ఇప్పటికీ ఎంత తేడా!! కాలేజీ రోజులు అతని కళ్ళ ముందు మెదిలాయి.

ఒక్క చదువులోనే కాదు. అన్నింటిలోనూ తనే ముందుండేవాడు. కాలేజీ డ్రమెటిక్ అసోసియేషన్ సెక్రటరీ.... ఎన్.సి.సి. అండర్ ఆఫీసర్...! తనంటే పెద్ద హీరో వర్షిప్ వుండేది.

అందరికీ నేనంటే అభిమానముంటే నాకు మాత్రం నీరజ అంటే క్రేజ్ వుండేది! ఆ క్రేజ్ కోసం ఏమి చేయటానికైనా సిద్ధంగా వుండేవాణ్ణి.

నీరజకి క్లాస్‌లో బాగా చదివేవాళ్ళంటే మంచి అభిమానముండేది. అందుకే ఎవరికి వారు ఆమె అభిమానాన్ని సంపాదించడం కోసం బాగా చదివేవాళ్ళం.

తనకి యాక్టివిటీస్ ఎక్కువగా వుండడంతో హఠాత్తుగా తనని అధిగమించేసాడు నిరంజనం. హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్‌లో అందరికన్నా అతనికే ఎక్కువ మార్కులు వచ్చాయి.

నీరజ అతని వేపు ఎక్కడ ఆకర్షింప బడుతుందో అనే భయం తనలో చోటు చేసుకుంది. ఫలితంగా అతని బలహీనమైన ఆర్థిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని రకరకాలుగా ఏడిపించసాగాడు.

ఒక రోజున ఓ చిలిపి ఆలోచన వచ్చింది. రావడమే ఆలశ్యం ఆచరణలో పెట్టేసాడు కూడా! తనేదైనా అనుకోవడమే ఆలశ్యం ఆచరణలో పెట్టేందుకు తోడ్పడడానికి ఎంతో మంది మిత్రులు!

ఒక చక్కటి ప్రేమలేఖని ఆచారితో రాయించి టైప్ చేయించాడు. కింద దొంగ సంతకాలు పెట్టడంలో వుద్ధండుడైన శేఖరం చేత నిరంజనం సంతకం పెట్టించాడు. జాగ్రత్తగా ఆ వుత్తరం నీరజకి చేరేటట్టు చేసాడు.

నిరంజనం రాసిన లవ్ లెటర్ చూడగానే నీరజ మండిపడుతుంది. ప్రిన్స్‌పల్‌గారికి రిపోర్ట్ ఇస్తుంది. ఒక్కదెబ్బతో రెండు పిట్టలు అన్నట్లు నీరజ విషయంలో వాడి పోటీ తొలగడమే కాకుండా తనకన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకునేవాడు కూడా క్లాస్‌లో వుండడు. అది తన ప్లాన్!

లవ్‌లెటర్ చదువుకున్న నీరజ మండి పడింది. దానిని నలిపి అందరూ చూస్తుండగానే నిరంజనం మొహం మీద కొట్టింది. అతనేదో చెప్పడానికి ప్రయత్నించినా వినిపించుకోలేదు.

"చదువుకోడానికి కాలేజీకి వచ్చి ఇలాంటి పనులు చెయ్యడానికి సిగ్గులేదూ...." అంటూ దులిపేసింది.

నిరంజనం మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు. సహనంతోనే నీరజ తిట్టే తిట్లన్నింటినీ భరించాడు. వెళ్తూ వెళ్తూ అతను తన వంక చూసిన చూపును మాత్రం ఎప్పుడూ మరచిపోలేదు... ఎంత అసహ్యంగా చూసాడూ... ఇప్పుడూ అదే చూపు..... అప్పుడు తను చేసిన దానికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోబోతున్నాడు...... ఇప్పుడు నిరంజనాన్ని ఢీకోడమంటే కొండతో ఢీ కోడమే!

"మిమ్మల్ని ఆఫీసర్‌గారు పిలుస్తున్నారు" అటెండర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు రాఘవ.

లంచ్ అవర్లో కూడా తనని విడిచి పెట్టడా? తను హంబుల్‌గా వున్నా విడిచిపెట్టడు! అట్లాంటప్పుడు తిరిగి పౌరుషాన్ని నిలబెట్టుకుని వుద్యోగాన్ని వూడగొట్టుకోవడమే మేలు.....!

స్థిర నిశ్చయానికి వచ్చి ఆఫీసర్ రూమ్ వేపు నడిచాడు.

"రావోయ్ రాఘవా.... రా..... లంచ్ అవర్లో కూడా సీట్లోంచి లేవకుండా కూర్చున్నావేమిటి?" చిన్నగా అన్నాడు నిరంజనం.

అనుకోని వాతావరణానికి కొద్దిగా కంగారుపడ్డాడు తను.

"అబ్బే..... ఏం లేదు...."

"నేను వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను. ఏమిటీ అదో మాదిరిగా వున్నావ్?" నిరంజనం సూటిగా అలా అనేసరికి ఏం జవాబు ఇవ్వాలో అర్థం కాలేదు రాఘవకి. ఇంతలో అటెండర్ కాఫీలు తెచ్చాడు.

తనో కప్పుని అందుకుని, రాఘవకి ఓ కప్పుని ఆఫర్ చేసాడు నిరంజనం.

హఠాత్తుగా అతనిలో కనిపిస్తున్న మార్పుని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక తికమక పడసాగాడు రాఘవ.

"ఇంతకు ముందు నా ప్రవర్తన చూసి చిరాకు పడి వుంటావ్..... అవునా?" కాఫీ సిప్ చేస్తూ రాఘవ మొహంలోకి చూసాడు నిరంజనం.

"లేదే....."

గట్టిగా నవ్వాడు నిరంజనం. "నీలో ఎంత మార్పు! అప్పటి రాఘవకి, ఇప్పటి రాఘవకి ఎంత తేడా! ఎదుటి వారి తల వంచడమే గాని తన తలవంచడమే తెలీదు ఆ రాఘవకి. అనవసరంగా

కంగారుపడిపోవడం, అతి వినయాన్ని చూపించడం ఈ రాఘవకి అలవాటు అయ్యింది.....!

ఇబ్బందిగా అనిపించసాగింది రాఘవకి 'ఇలా మాట్లాడడం కన్నా తిట్టడమే మేలు!'

"నీకు గుర్తుందా ఆ సంఘటన. నేను రాసినట్లు లవ్ లెటర్ రాసి ఇస్తే నీరజ పూర్వాపరాలు ఆలోచించకుండా అందరిలోనూ నన్ను అవమానించింది. అప్పుడే ఆ క్షణంలో శపథం తీసుకున్నాను - ఆమె చేతే పొగిడించుకోవాలని! రాత్రింబగళ్ళు కష్టపడ్డాను. యూనివర్శిటీ రాంక్ వచ్చింది. స్కాలర్‌షిప్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చేసి మంచి మార్కులు సంపాదించాను. నేనెంత కష్టపడి చదువుతున్నా మీ ఇద్దరి గురించీ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వుండేవాణ్ణి. యాక్టివిటీస్ ఎక్కువయి పోయిన నువ్వు డిగ్రీతోనే చదువాపేసావు..... నీకు వుద్యోగం వచ్చిన డిపార్ట్‌మెంట్‌లోనే నాకూ వుద్యోగం రావాలని, ఆఫీసర్‌గా వుండి నిన్ను సాధించాలని అనుకుంటూ వుండేవాణ్ణి....." ఒక్క క్షణం చెప్పడం ఆపి, కాఫీని పూర్తి చేసి కప్పు కింద పెట్టాడు. నిరంజనం.

కాఫీ తాగడం కూడా మరచిపోయి గుండెలు వుగ్గబట్టుకుని కూర్చున్నాడు రాఘవ.

"మరేం కంగారుపడకు కాఫీ కానీ..... ఆ వయసు వేరు. ఆ ఆలోచనలు వేరు. ఇప్పుడవన్నీ సిల్లీగా అనిపిస్తాయి. ఇప్పుడు ఈ ఆఫీసుకు అధిపతిని నేను. బాగా పనిచేసే వాళ్ళు కావాలి నాకు. నీ గురించి హెడ్ క్లర్కు ద్వారా తెలుసుకున్నాను. కొత్తగా ఆ సీట్‌కి వచ్చావని, పెండింగ్ వర్క్ అంతా త్వర త్వరగా క్లియర్ చేస్తున్నావని. వెరీగుడ్...... కీప్ ఇట్ అప్....."

"థాంక్యూ సర్......" ఎప్పుడు ఆ గదిలోంచి బయటపడదామా అని వుంది రాఘవకి.

"నీకు కూడా నేను థాంక్స్ చెప్పాలి. నువ్వప్పుడు అలా చేసావు కాబట్టి నేనిప్పుడీ స్థితికి వచ్చాను. అంతకన్నా ముఖ్యంగా నీరజని భార్యగా పొందగలిగాను... మీ నాటకం తెలిసి తర్వాత నాకు క్షమాపణలు చెప్పకుంది. బహుశా అప్పడే మొదలైందేమో మా ఇద్దరి మధ్యా ప్రేమ....! వచ్చే వారంలో ఆమెను తీసుకొస్తాను. ఓ మంచి ఇల్లు చూసిపెడుదూ..." చిరునవ్వుతో అడిగాడు నిరంజనం. "అలాగే సర్...." అంటూ తన సీట్లోకి వచ్చి ఫైళ్ళలో మునిగిపోయాడు రాఘవ.

*

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 5-7-84)